బుధ వారం
31-01-2024
సంపుటి - 09,
సంచిక - 440
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra
Pradhesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
జాతీయ తెలుగు వార్త పత్రిక
❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# నేటి నుండి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు



- ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- ఫిబ్రవరి1న ఆర్థికమంత్రి ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- సభ సజావుగా సాగాలని కోరుకుంటున్న ప్రభుత్వం


**న్యూఢిల్లీ, జనవరి 30 (సమ సమాజం):** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొత్త భవనంలో నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో చివరి బడ్జెట్ సమావేశం మొదలవుతుంది. ఉభయ సభలను ఉద్దేశించి ముర్ము ప్రసంగిస్తారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం నాడు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్ సభలో ప్రవేశ పెడతారు. ఏప్రిల్- మే నెలలో తే ఏప్రిల్- జులైకి కావాల్సిన నిధులను ప్రో రేటా ప్రాతిపదికన భారత సంఘటిత నిధి నుంచి తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం 2024-25 ఏడాదికి జూన్‌లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఈ క్రమంలో కొత్త పథకాలు లేదా విధానాలు ప్రకటించే అవకాశం ఉండకపోవచ్చు. ఆర్థికమంత్రిగా వరసగా ఆరోసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమర్పిస్తున్నారు. ఐదు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపా దిస్తారు. ఎన్నికల నేపథ్యంలో విధానపర ప్రకటనలు ఏమి ఉండకపోవచ్చు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం తెలిపి సార్లు పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించారు. ఈ సారి ఓటాన్ అకౌంట్ బ్జడెట్ ప్రతిపాదిస్తారు. వరసగా ఆరోసారి బ్జడెట్ సమర్పించిన మహిళ నేతగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ అత్యధికంగా పది సార్లు బ్జడెట్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత స్థానంలో నిర్మలా సీతారామన్ నిలుస్తారు. అరుణ్ జైట్లీ, పి చిదంబరం, యశ్వంత్ సిన్హా, మన్మోహన్ సింగ్ ఐదు సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ బ్జడెట్ ప్రవేశపెట్టారు. ఇందిరా తర్వాత బడ్జెట్ ప్రతిపాదించిన మహిళా నేతగా నిర్మలా సీతారామన్ నిలిచారు. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. అరుణ్ జైట్లీ కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేశారు. 2014-15, 2015-16, 2016-2017, 2017-2018, 2018-2019 ఐదుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. జైట్లీ అనారోగ్యానికి గురికావడంతో 2019-2020 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం పీయూష్ గోయల్‌కు వచ్చింది. 2019లో మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చింది. జైట్లీ సూచనలతో నిర్మలా సీతారామన్‌కు ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలను ఇచ్చినట్టు తెలుస్తోంది. అలా వరసగాబడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం వచ్చింది. రెండో అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన నేతగా రికార్డు సృష్టించారు. తన బ్జడెట్‌లో సంస్కరణలకే నిర్మలా సీతారామన్ ప్రాధాన్యం ఇచ్చారు. సూట్ కేసులా కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే సంప్రదాయానికి నిర్మలా సీతారామన్ శ్రీకారం చుట్టారు.ఓట్ ఆన్ అకౌంట్ బ్జడెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని 50 శాతం పెంచే అవకాశం ఉంది. కిసాన్ సన్మాన్ పథకం ద్వారా భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేల పంట సాయాని మూడు విడతలుగా అందిస్తున్నారు. ఇప్పుడు దానిని రూ.9

4వ పేజీలో...

## కొత్త జిల్లాల ఏర్పాటుపై కమిషన్

సిఎం హామీ మేరకు అసెంబ్లీలో చర్చ

కొత్తగా పివి పేరుతో జిల్లా ఏర్పాటు డిమాండ్




**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** కొత్త జిల్లాల ఏర్పాటు అసంబద్ధంగా జరిగిందని సిఎం రేవంత్ రెడ్డి అంగీకరించాక..దీనిపై కమిషన్ వేసి అధ్యయనం చేస్తామని ప్రకటించారు. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటులో ఉన్న లోటుపాట్లను తొలగిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో జిల్లాల కుదింపు జరగవచ్చున్న సంకేతాలు వచ్చాయి. పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలు చేశారు. ఇందులో అధ్యయనం తరవాత శాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటుకు మార్గం సుగమం కావచ్చు. గత బిఆర్ఎస్ హయాంలో కొత్త జిల్లాలను ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేశారు. కొత్తగా కమిషన్ ఏర్పాటు చేసి, అసెంబ్లీలో చర్చించాక కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేస్తామని సిఎం రేవంత్ ప్రకటించారు. దీంతో శాస్త్రీయంగా ఏర్పాటుకు అవకాశం రానుంది. ఈ క్రమంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు పేరుతో

4వ పేజీలో...

# జాతిపితకు సిఎం ఘన నివాళి

## ప్రభుత్వ క్యాలెండర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు గననివాళి అర్పించింది. మంగళవారం లంగర్‌హౌజ్ బాపూఘాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి తదితరులు గాంధీఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు. మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు. పలువురు ప్రముఖులు జాతిపితకు నివాళి అర్పించారు.ఇదిలావుంటే సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎస్ శాంతికుమారి, హోం సెక్రటరీ జితేందర్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్ అంజన్ కుమార్‌లు ఉన్నారు.



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణానికి బ్రేక్

### తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిలుపు చేసిన హైకోర్టు



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారానికి హైకోర్టులో బ్రేక్ పడింది. యథాతథ స్థితిని కొనసాగించాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమిరుల్లా ఖాన్‌లు ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఎమ్మెల్సీల నియామకంపై బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. గతంలో తాము వేసిన పిటిషన్‌పై విచారణ తేలే వరకు ఎమ్మెల్సీల నియామకాలు ఆపాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణకు రాగా.. యథాతథంగా కొనసాగించాలంటూ న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి హైకోర్టు వాయిదా వేసింది. ఈ మేరకు గవర్నర్ కోటా

4వ పేజీలో...

# ధర్నాలో విద్యార్థిని ఈడ్చుకెళ్లిన కానిస్టేబుల్

## ఘటనపై స్పందించి..కానిస్టేబుల్ సస్పెండ్

**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** హైకోర్టుకు వ్యవసాయ వర్సిటీ భూముల అప్పగింతపై నిరసన చేపట్టిన ఓ ఏబీవీపీ కార్యకర్తను జుట్టుపట్టి ఈడ్చుకెళ్లిన ఘటనలో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. ఘటనకు బాధ్యురాలైన మహిళాకానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ భూములు హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 55 జారీ జీవోను వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నాయి. ఇందులోభాగంగా ఈ నెల 24న ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అయితే, స్థానిక పోలీసులు విద్యార్థులను చెదరగొట్టారు. ఆ సమయంలో కానిస్టేబుల్

4వ పేజీలో...

# కెటిఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రాజకీయాలు

- సొంత ఇలాఖాలోనే నేతల తిరుగుబాటు
- పార్టీ కట్టుదాటుతున్న కిందిస్థాయి నేతలు
- పూర్తిగా దెబ్బతీయాలన్న ప్రయత్నాల్లో కాంగ్రెస్

**కరీంనగర్, జనవరి 30 (సమ సమాజం):** తాజా రాజకీయ పరిణామాలతో కేటీఆర్ ఉక్కిరిబిక్కిరవుతున్నారని తెలుస్తోంది. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు రాజీనామాల బాట పడుతుండడంతో కేటీఆర్ కలవరం చెందుతున్నారు. పార్టీ నేతలను కాపాడుకోలేక ఆయన తంటాలు పడుతున్నారని చర్చ నడుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలపై పూర్తి స్థాయిలో ఫోకస్ చేసింది. వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇందుకోసం



4వ పేజీలో...

# దేశంలో కులగణన రాజకీయాలు !

దేశంలో కుల రాజకీయాలు, వర్గ రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయ నాయకుల ఎజెండా ఓట్లు కొల్లగొట్ట డమే తప్ప మరోటి కాదు. కులాల వారీగా విభజించి ఓట్లు కొల్లగొట్టే ఎత్తులకు ప్రయత్నాలు మొదల య్యాయి. దీనిని అడ్డుకోవాలన్న ధ్యాస మేధావివర్గంలో లేకుండా పోతోంది. బీహార్‌లో మొదలైన కులగణన చిచ్చు..ఇప్పుడు దేశంలో క్యాన్సర్‌లా విస్తరిస్తోంది. నిజానికి ఆర్థిక అసమానతలపై జనాభా గణన జరగాలి. ఏ గ్రామానికి వెళ్లినా ఉన్నవారెవరో..లేని వారెవరో ప్రత్యక్షంగా కనినిస్తుంది. ఇళ్లు ఉన్నవారు లేని వారు కూడా కనినిస్తారు. ఆర్థికంగా బలవంతులు ఎవ్వరో..బలహీనులు ఎవ్వరో కనిపిస్తుంది. అంతెందుకు ఇప్పుడున్న తెల్ల రేషన్ కార్డుదారుల్లో వేలాదిమంది ఆర్థికంగా ఉన్నతవర్గాలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్ పొందేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తెల్ల కార్డులు పొందారు. ఈ రెండు రాష్ట్రాల్లో కార్డుల ఆధారంగా వారి ఆర్థికస్థితిగతులను లెక్క కట్టగలమా అన్నది చెప్పాలి. కులగణన చేపట్టాలని ఇరు తెలుగు రాష్ట్రాల్లో తీసుకున్న నిర్ణయం వల్ల కులాల సంఖ్య తేలవచ్చు.. కానీ ఆర్థికస్థితిగతులు తేలవు. కులాల కుంపట్లు పోవాలని కోరుతున్న వారే ఇప్పుడీ కులగణనకు పూనుకోవడం దారుణం. కారణమేంటంటే కులాల వారీగా ఓట్లు పొందాలన్న రాజకీయ కారణమే వారిని ఇలా చేయిస్తోంది. సామాజిక వెనకబాటుతనం గతంలో లాగా లేదు. కులాల మధ్య అంతరాలను తొలగించాల్సిందే. సమాజంలో అంతా ఒక్కటే అన్న భావన పెంపొందించే చర్యలు కావాలి. కులాల ఆధారంగా ఇది సాధ్యం కాదు. దేశ రాజకీయాల్లో ఇప్పుడు వీస్తున్న గాలి కులగణన, అంటే వెనుకబడిన తరగతుల జనాభా లెక్కలు తేల్చడం, కులాల వారీగా జన గణనను చేపట్టడం మాత్రమే అవుతుంది. అలాంటి వారి ఆర్థిక స్థితిగతులను కూడా చేపడితే..ముున్ముందు వెకబడిన వర్గాలకు ఏవైనా పథకాలు అమలు చేయాలన్నప్పుడు ఇలాంటి వారిని గుర్తించడం సులవు కాగలదు. జాతీయ స్థాయిలో దీనిని నిర్వహించడానికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరాకరించింది. ఇది సమాజాంలో అసంతృప్తులకు, విభజనకు కారణం అవుతుందని భావించారు. ఇది ముమ్మాటికీ నిజం. దీంతో సమాజంలో చీలిక వస్తుంది. అంతరాలు ఏర్పడుతాయి. అయితే ఈ వాదాన్ని ఎవ్వరు కూడా పట్టించు కోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో కులగణనకు అంగీకరించింది. ఈ క్రమంలో తెలంగాణలో కులగణనకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పూనుకుంటోంది. గతంలోనే బీహార్ లోని నితీశ్ కుమార్ నాయకత్వంలోని జెడి (యు)–, ఆర్‌జెడిల మహాఘట్ బంధన్ ప్రభుత్వం తొలిసారిగా ఆ రాష్ట్రంలో కులప్రాతిపదిక జనాభాలెక్కల సేకరణను పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్ కూడా దీనిని చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన ఆవశ్యకతను గుర్తించి తాము అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో దీనిని జరిపిస్తామని ప్రకటించారు. తెలంగాణలో కులగణనను చేపడతామని మొన్న జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచార సమయంలో రాహుల్ గాంధీ వాగ్దానం చేశారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాజాగా నిర్ణయం తీసుకొంది. త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లోనే కుల గణనకు సంబంధించిన బిల్లు ప్రవేశపెడతారని తెలుస్తు న్నది. దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు ప్రత్యేక కమిటీ వేసి బీహార్‌లో జరిగిన పద్ధతిని అధ్యయనం చేయించనున్నారని సమాచారం. రాష్ట్రంలో కులగణన చేపట్టబోతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాహుల్ గాంధీ అభినందించారు. ఎందుకంటగే ప్రకటించిన హామీ మేరకు ముందుకు సాగుతున్నారు. నిజానికి దీని అవసరం లేదని వారు గుర్తించడం లేదు. సమాజంలో అంతరాలను తొలగించే ప్రయత్నం కానీ, అధ్యయనం కానీ జరగడం లేదు. దేశంలో అత్యధిక జనం ఇంకా పేదరికంలోనే

మగ్గుతున్నారు. సగానికి మించిన జన సంఖ్య సరైన తిండి, ఇల్లు, ఇతర మానవీయ జీవన సౌకర్యాలకు దూరంగా బతుకుతున్నారు. ఈ పేదరికం అన్నది కులాన్ని అంటిపెట్టుకొని లేదు.. ఉన్నతవర్గాలుగా చెబుతున్న అనేక కులాల్లో పేదలు లెక్కకు మిక్కిలి ఉన్నారు. బ్రాహ్మణవర్గాల్లో నేటికీ యాచకవృత్తితో బతుకుతున్న వారు లక్షల్లో ఉన్నారు. వీరిని ఉన్నత కులాలుగా పిలుస్తున్నా..వీరికి ఏ పథకం అందడం లేదు. నిజానికి భారతదేశంలో శ్రామికవర్గాలకు చెందిన వారే ఇప్పటికీ దుర్భర దారిద్య్రంలో ఉన్నారు. ఇందులో అన్ని కులాల వారు ఉన్నారు. తమ బతుకుదెరవు కోసం వీరు నిత్యకూలీలుగా ఉన్నారు. వీరికి సరైన న్యాయం జరగాలంటే కులాలవారీ జనగణన అవసరం లేదు. కుటుంబాల ఆధారంగా ఆర్థిక గణన జరగాలి. కొత్తగా మరికొన్ని కులాల వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న ఆలోచనలు కూడా మంచిది కాదు. అమెరికాలో నేటికీ కులాల ఆధారంగా లెక్కలు తీయడం లేదు. ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లిన వారు తమ కులాల గురించి మాట్లాడడం లేదు. బ్రిటిష్ వారు 1931లో సేకరించిన కులాలవారీ లెక్కల తరవాత సమాజంలో మార్పులు వచ్చాయి. అనేక కులాల వారు స్వశక్తితో పైకి వచ్చారు. తమకంటే హోదాను ఏర్పరచుకున్నారు. సమాజంలో ఉన్నతవర్గాలుగా చెలామణి అవుతున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికీ కులాల కుంపట్ల మీదనే ఆధారపడుతున్నాయి. ఏ వర్గానికి, ఏ మేలు చేయాలన్నా కులాల ఆధారంగానే లెక్కలు వేస్తున్నారు. ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. నిజానికి సమగ్ర సామాజిక సర్వే తప్పనిసరి. విద్య, ఉద్యోగాల్లో దక్కుతున్న రిజర్వేషన్లు అర్హులకు దక్కడం లేదు. రిజర్వేషన్లు పొందిన వారు ఆర్థికంగా బాగుపడ్డా ఇంకా కులాల ఆధారంగా లబ్ది పొందుతు న్నారు. దీనిని తొలుత నిర్మూలించాలి. కులాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం మంచిదే అయినా.. అర్హులను కూడా గుర్తించాలి. అర్హులకే ప్రభుత్వ పథకాలు అందాలి. ఆర్థిక అసమానతలే ఇందుకు గీటురాయి కావాలి. కులగణన ఆధారంగా కేవలం రాజకీయంగా మాత్రమే లబ్ది పొందగలరని భావించాలి.

# త్వరలోనే సీట్ల సర్దుబాటు

## ఉమ్మడి ప్రచారంపైనా నేతల దృష్టి ■ జనసేన, టిడిపిల మధ్య కొలిక్కిరానున్న సర్దుబాటు



**అమరావతి, జనవరి 30 (సమ సమాజం):** జనసేన, టిడిపిల మధ్య సీట్ల సర్దుబాటు త్వరలోనే సర్దుబాటు కానుందని తెలుస్తోంది. అలాగే రెండు పార్టీల అధినేతలు ఉమ్మడి ప్రచారానికి సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. వచ్చే నెల 4 నుంచి మిగిలిపోయిన పార్లమెంట్ నియోజకవర్గాల్లో రా కదలిరా సభలు పెట్టనున్నారు. ఫిబ్రవరి 4న అనకాపల్లి నుంచి పవన్ కల్యాణ్ పర్యటనలు ప్రారంభించే అవకాశం ఉంది. ఉమ్మడిగా రాష్ట్రస్థాయి సభల్ని నిర్వహించాలని పవన్, చంద్రబాబు భావిస్తున్నారు. వీటిపైన ఫిబ్రవరి మొదటి వారంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఏపీలో టీడీపీ, జనసేన మధ్య సీట్ల సర్దుబాటు త్వరలో చివరిదశకు చేరుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే రెండు పార్టీల మధ్య పలుమార్లు చర్చలు జరిగాయి. చంద్రబాబు, పవన్ కూడా రెండుసార్లు సమావేశం అయ్యారు. ఎవరు ఎన్ని సీట్లలో పోటీ చేయాలి.. ఏయే సీట్లలో పోటీ చేయాలన్న అంశంపై ఇప్పటికే ప్రాథమికంగా వారు ఓ అవగాహనకు వచ్చినట్లగా తెలుస్తోంది. ఫిబ్రవరిలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున మొదటి వారంలో సీట్ల సర్దుబాటు ప్రకటన చేస్తే.. తర్వాత అసంతృప్తుల్ని బుజ్జగించవచ్చని అనుకుంటున్నారు. ఎన్నికల సమయానికి కూటమి స్మూత్ గా పోలింగ్ కు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవాలని అనుకుంటున్నారు. పవన్ కల్యాణ్ ఇటీవల రెండు సీట్లు తమ పార్టీ తరపునపోటీ చేస్తున్నామని ప్రకటించారు. అందులో ఒకటి రాజోలు, రెండోది రాజా నగరం. అంతకు ముందు చంద్రబాబునాయుడు ప్రచార సభల్లో మండపేట, అరకులనుంచి అభ్యర్థుల్ని ప్రకటించారు. ఇది జనసేన పార్టీలో భిన్నాభిప్రాయాలకు కారణం అయింది. పొత్తులో ఉండి ఇలా ఏకపక్షంగా సీట్లు కేటాయించుకుని అభ్యర్థుల్ని ప్రకటించుకోవడం ఏమిటని పార్టీ క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పవన్ సర్ది చెప్పారు. తాను కూడా రెండు సీట్లకు అభ్యర్థుల్ని ప్రకటించారు. తర్వాత నాగేంద్ర బాబు చర్య, ప్రతి చర్య అంటూ పోస్టింగ్ పెట్టడం కూడా వివాదాస్పదమయింది. చివరికి అవి పెరగకుండా చూసుకోవాలని రెండు పార్టీల నేతలు ఓ అభిప్రాయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. నిజానికి టీడీపీ, జనసేన ఎవరెవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలన్న అంశంపై ఇప్పటికే ఓ అవగాహనకు వచ్చాయని.. అంతర్గతంగా ఏ ఏ సీట్లు అన్నది కూడా ఖరారు చేసుకున్నారని అంటున్నారు. అభ్యర్థుల అంశంపైనా ఓ అంచనాకు వచ్చారని చెబుతున్నారు. అయితే బీజేపీతో జనసేన పార్టీ చర్చలు జరుపుతోంది. తాము, జనసేన పార్టీ పొత్తులో ఉన్నామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో అధికారికంగా పొత్తుల ప్రకటన చేయడంలో ఆలస్యం అవుతుంది. పవన్ కల్యాణ్ ఢిల్లీ వెళ్లే అవకాశం ఉందని.. ప్రచారం జరుగుతోంది. వెళ్లినా వెల్లకపోయినా.. ఫిబ్రవరి మొదటి వారంలో పొత్తుల ప్రకటన, సీట్ల సర్దుబాటు అంశాలపై రెండు పార్టీలు ఓ ప్రకటనచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు, పవన్ మరోసారి సీట్ల అంశంపై చర్చించేందుకు భేటీ కానున్నారు.

---

# మైనార్టీలకు మీరు చేసిందేమిటి ?

## కెటిఆర్‌కు షబ్బీర్ అలీ ప్రశ్న



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** మాజీ మంత్రి కేటీఆర్ మైనార్టీలపై దొంగ ప్రేమ ఒలకబోస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలను విస్మరించారని అన్నారు. 12 శాతం రిజర్వేషన్లకు అతీగతి లేదన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మీరు అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు ఏం చేశారు? కామారెడ్డికి వచ్చి మీ అయ్య ఎందుకు పోటీ చేసిండు? ఒక్క అమాయకుణ్ణి ఓడగొట్టడానికి ఎన్ని ప్రయత్నాలు చేసింద్రు' అంటూ విరుచుకుపడ్డారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు చేసిందేమి లేదన్నారు. తనకు కాంగ్రెస్ సర్కార్ సలహాదారులుగా నియమించిందన్నారు. ఎన్నికల్లో నిలబడ్డ మైనార్టీ నేతలు ఓడిపోయారని.. ఏం చేద్దాం మరి అని ప్రశ్నించారు. మైనార్టీలకు కాంగ్రెస్ అవకాశాలు ఇస్తుందన్నారు. ఇప్పటి వరకు వేసిన టీఎస్పీఎస్సీలో కావచ్చు, సుప్రీం కోర్టులో ఏజీగా మైనార్టీకి అవకాశం ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో కూడా మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తదని స్పష్టం చేశారు. 'ముందు మీ అయ్యతో కామారెడ్డికి వచ్చి ఎందుకు పోటీ చేశాడో చెప్పించు' అంటూ కేటీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ పోరు

## ఢిల్లీలో ధర్నా యోచనలో పిసిసి చీఫ్ షర్మిల



**అమరావతి, జనవరి 30 (సమ సమాజం):** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు దగ్గర పడుతున్న టైంలో ఇప్పుడు మరోసారి ప్రత్యేక హోదా తెరపైకి వచ్చింది. అధికార ప్రతిపక్షాలు దీన్ని పెద్దగా పెట్టించుకోకపోయినా కాంగ్రెస్ దీన్ని హైలెట్ చేస్తోంది. పదేళ్లుగా ప్రత్యేక హోదా అంశాన్ని బీజేపీతో కుమ్మక్కై అన్ని పార్టీలు పక్కన పెట్టేశాయని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కచ్చితంగా ప్రత్యేక హోదాను ఇస్తామని అంటున్నారు. ప్రత్యేక హోదాను ప్రజల్లోకి మరోసారి తీసుకెళ్లేందుకు షర్మిల బహిరంగ సభల్లో చెప్పడమే కాకుండా ఇప్పుడు ఏకంగా ఢిల్లీ వేదికగా పోరాటాలు చేయనున్నారు. ఫిబ్రవరి 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయనున్నారు. పదేళ్ల క్రితం ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామని చెప్పిన బీజేపీ మాట తప్పిందని ఇది నమ్మక ద్రోహం అని నిరసన చేపట్టనున్నారు. దీనికి కాంగ్రెస్ అధినాయకత్వం నుంచి సీనియర్ లీడర్లు రానున్నారు. ప్రస్తుతం న్యాయ్ యాత్ర చేస్తున్న రాహుల్ గాంధీ కూడా ఈ ధర్నాలో పాల్గొంటారని చెబుతున్నారు.

# తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు

## మున్సిపల్ తీర్మానానికి ప్రభుత్వం ఆమోదం



**సంగారెడ్డి, జనవరి 30 (సమ సమాజం):** ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధి తెల్లాపూర్ మున్సిపాలిటీలోని రామచంద్రాపురంలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లభించింది. గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ చేసిన తీర్మాణాన్ని ప్రభుత్వం ఆమోదించింది. గద్దర్ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రజాకవి గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానన్న రేవంత్‌రెడ్డి మాటను ఇచ్చారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ చేసిన తీర్మానాన్ని హెచ్ఎండీఏ ఆమోదించింది. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తూ రేవంత్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజా యుద్ధ నౌకగా పేరుగడించిన గద్దర్ అనారోగ్యం కారణంగా మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణించిన సమయంలో రాజకీయ పార్టీలు స్పందించి తీరు అప్పట్లో చర్చకు దారి తీశాయి. అయితే టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి మాత్రం గద్దర్ అంతిమయాత్రలో అన్నీ తానై ముందుకు నడిపించారు. గద్దర్ మరణ వార్త తెలిసిన వెంటనే ఆస్పత్రికి చేరుకున్న రేవంత్.. భౌతికకాయాన్ని ఎల్బీస్టేడియంకు తరలించడం దగ్గర నుంచి అంతిమయాత్ర, అంత్యక్రియలు ఇలా అన్నింటిలో ముందుండి నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు జరిగినప్పటికీ.. అక్కడ అన్నీ చూసుకుంది మాత్రం రేవంత్ రెడ్డే. మొత్తానికి గద్దర్‌ను కాంగ్రెస్ తన సొంతమనిషిలా చూసుకుని ఘనంగా వీడ్కోలు పలికింది. కాగా.. గద్దర్ తన కుమారుడు సూర్యను రాజకీయాల్లో తీసుకురావాలని ఎంతగానో ప్రయత్నిం చారు. అనుకున్నదే తడువుగా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలిసి కుమారుడితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్త పార్టీ పెట్టాలన్న ఆలోచనను కూడా పక్కన పెట్టి చివరకు వరకు కాంగ్రెస్ పార్టీతో సత్సంబంధాలు కొనసాగించారు. అయితే కుమారుడిని రాజకీయాల్లో ఉన్నంత స్థాయిలో చూడాలన్న కోరిక తీరకుండానే గద్దర్ ప్రాణాలు వదిలారు. అయితే గద్దర్ కోరికను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చింది. గద్దర్ కుటుంబానికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. కుమారుడికి బదులుగా గద్దర్ కుమార్తె వెన్నెలకు గత ఎన్నికల్లో హైదరాబాద్ కంటోన్మెంట్ టికెట్‌ను కేటాయించింది. అయితే ఆ ఎన్నికల్లో వెన్నెల ఓటమిపాలయ్యారు.

# జాతిపితకు జగన్ ఘన నివాళి



**అమరావతి, జనవరి 30 (సమ సమాజం):** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీఎం వైఎస్ జగన్‌నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్ఆర్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి. విజయసాయి రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

---

# వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 30 (సమ సమాజం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. వాటర్‌ట్యాంక్ పైనుంచి పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన బూర్గంపాడు మండలం సారపాక లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే మృతుడు మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు. విచారణలో పూర్తి వివరాలు వెల్లడవుతాయని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

# ఎన్నికల ముందు పూలే గుర్తుకు వచ్చారా

## పదేళ్ల పాలనలో ఆ మహనీయుడిని మరిచారా

## కవిత డిమాండ్‌పై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో మహనీయులు జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేస్తున్న రాజకీయ డిమాండ్‌పై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. పదేళ్లుగా లేని విషయం ఇప్పుడే ..అధికారం పోగానే గుర్తుకు వచ్చిందా అని మండిపడుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే కవితకు ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఈ అంశంపై ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి కవిత వినతిపత్రం కూడా అందజేశారు. అయితే కవిత ప్రతిపాదనపై కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తుతున్నారు. జ్యోతిరావు పూలే విగ్రహం పెట్టాలని ఇప్పుడు గుర్తొచ్చిందా?.. పదేళ్లు మీ ప్రభుత్వంలో ఉండి ఏం చేశారంటూ హస్తం నేతలు మండిపడుతున్నారు. తాజాగా ఇదే అంశంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కవితపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు విషయం 10 ఏళ్ల వాళ్ల ప్రభుత్వంలో కవితకు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. అప్పుడు ఎవరు అడ్డుకున్నారో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. అప్పటి సీఎం అడ్డుకున్నారా లేక స్పీకర్ అడ్డుకున్నారా అనేది స్పష్టం చేయాలన్నారు. జ్యోతిబాపూలే జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించిందే కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. మహనీయులను స్మరించుకోవడంలో కాంగ్రెస్‌కు ఎవరూ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నాయనే ఆలోచనతో రాజకీయంగా లబ్ది పొందేందుకే జ్యోతిబాపూలే అంశం తెరపైకి తీసుకువచ్చారని మండిపడ్డారు. అసెంబ్లీ పరిసరాలు పూర్తిగా స్పీకర్, మండలి చైర్మన్ అధీనంలోనే ఉంటాయన్నారు. మండలి చైర్మన్ వారి పార్టీ మనిషే కదా అని అన్నారు. గవర్నర్ తీసుకునే నిర్ణయాలను వక్రభాష్యం పలకడం కేటీఆర్‌కు సమంజసం కాదన్నారు. ఎమ్మెల్సీల అంశం కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. న్యాయస్థానానికి కూడా వక్ర భాష్యం పలుకుతారా అని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు అనేది కేబినెట్‌లో చర్చించి

# కరీంనగర్‌కు నిధులపై బండి చర్చకు రావాలి

## ఒక్క అభివృద్ధి ప్రాజెక్ట్ తేని వ్యక్తి బండి



మాజీ ఎంపి వినోద్‌పై విమర్శలు సరికాదు♦బీఆర్ఎస్ విద్యార్థి, యూత్ నాయకులు డిమాండ్

**కరీంనగర్, జనవరి 30 (సమ సమాజం):** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చావో బండి సంజయ్ చర్చకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ విద్యార్థి,యూత్ నాయకులు డిమాండ్ చేశారు. బండి సంజయ్ మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని కూడా అన్నారు. నోరు ఉంది కదా అని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పై తప్పుడు కూతలు కూస్తే ఇక్కడ చూస్తూ ఊరుకునేవారు లేరని కూడా హెచ్చరించారు. ఎన్నికలు రాగానే మతం ముసుగులో రాజకీయాలు చేసే బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఎంతో చూపించేందు చర్చకు సిద్ధం కావాలని జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవిందర్ రెడ్డి, బీఆర్ఎస్ విద్యార్థి,యూత్ నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, భూక్య తిరుపతి నాయక్, ద్యావ మధుసూదన్ రెడ్డి, కేంసారం తిరుపతిలు అన్నారు. కరీంనగర్ లోని మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బోయినపల్లి వినోద్ కుమార్ నాస్తికుడు అని తప్పుడు కూతలు కూస్తున్నావని మండిపడ్డారు. బోయినపల్లి వినోద్ కుమార్ గారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంటు లో గళమెత్తిన గొప్ప వ్యక్తన్నారు. బండి సంజయ్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో చూపించు...కేంద్రం నుంచి ఏడాదికోసారి రెగ్యులర్ గా వచ్చే నిధులు కూడా తెచ్చినట్లు బిల్డప్ లు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014లో బోయినపల్లి వినోద్ కుమార్ ఎంపీ అయ్యాక రైల్వే లైన్ మంజూరు చేయించారు... కనీసం కరీంనగర్ కు ఆర్ఓబి అయినా తెచ్చావా బండి అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయడం చేతకాని బండి సంజయ్...ఎన్నికలు రాగానే మతం ముసుగు వేసుకుని రాజకీయాలు చేస్తున్నారని, దమ్ము ఉంటే ప్రజాక్షేత్రంలో చేసిన అభివృద్ధి చూపించి మాట్లాడలని అన్నారు. దేవుళ్ళ పేరు చెప్పి ఎవరు వ్యాపారం..రాజకీయాలు చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. కరీంనగర్ నడిఒడ్డున టీటీడీ నుంచి 25 కోట్ల నిధులు తెచ్చి వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం చేయించిన ఘనత బోయినపల్లి వినోద్ కుమార్‌దని అన్నారు. వేములవాడ, కొండగట్టు ఆలయాల నిర్మాణాలకు బండి సంజయ్ నయాపైసా అయినా తెచ్చారా అని వారు ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న బండి సంజయ్ కి ప్రజలు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. మా బోయినపల్లి వినోద్ కుమార్ తెలంగాణ రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల అనుమతులతో పాటు పవర్ ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చారని అన్నారు. ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిదీలో ఒక్క నవోదయ పాఠశాల అయినా తెచ్చావ...ఏమన్న అంటే శివమ్ ఎత్తే మాది..శవం ఎత్తే మీది అంటూ ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నావ్ తప్ప నీ ఎప్పుడైనా అభివృద్ధి చేశావా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గవ్వ వంశీధర్ రెడ్డి, బండ వెనుయాదవ్, శ్రావణ్ పటేల్ ,సత్తినేని శ్రీనివాస్, ప్రదీప్, తరుణ్, నవీన్, ఓంకార్, సాయికృష్ణ, జశ్వంత్, శ్రీనివాస్, స్వామి, ప్రదీప్, మణిదీప్, మహేందర్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

- ♦కాంగ్రెస్ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటు
- ♦ఉద్యోగ నియామకాలను పక్కదారి పట్టించే చర్య
- ♦మా హయాంలోనే ఆస్పత్రులను ఏర్పాటు చేశాం
- ♦మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందించే కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమం 'వంట అయినంక గరిటె తిప్పినట్లు' ఉందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. ఉద్యోగ భర్తీ ప్రక్రియను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తే.. తమ ప్రభుత్వ ఘనతగా నియామక పత్రాల జారీ పేరుతో కాంగ్రెస్ సర్కారు హడావుడి చేస్తుండడం దౌర్భాగ్యమన్నారు. ఫిబ్రవరి ఒకటిన గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రచారం చేసిందని.. దాని నుంచి విద్యార్థుల దృష్టి మరల్చేందుకు ముందు రోజున స్టాఫ్ నర్సులకు నియామక పత్రాల జారీ కార్యక్రమాన్ని హంగు ఆర్భాటంతో నిర్వహిస్తుందన్నారు. చేయని పనులకు డబ్బా కొట్టుకోవడం బదులు.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ చూపాలని హరీశ్‌రావు హితవు పలికారు. తెలంగాణ వైద్యారోగ్య రంగాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేర్చే లక్ష్యంలో భాగంగా పెద్ద సంఖ్యలో ఆసుపత్రుల నిర్మాణంతో పాటు జిల్లాకో మెడికల్ కాలేజీ బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది కొరత లేకుండా ఉండేందుకు మెడికల్, నర్సింగ్, పారామెడికల్, ఫార్మాసిస్టు, ఇతర సిబ్బంది రిక్రూట్మెంట్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 5,204 స్టాఫ్ నర్స్‌పోస్టులకు 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేయగా.. 2023 జూన్ 22న 1,890 పోస్టులను కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 7,094కు పెరిగిందని తెలిపారు. 2023 ఆగస్టు 2న ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించి, తుది ఫలితాలు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ మొదలైందన్నారు. దాంతో తుది ఫలితాల విడుదలకు తాత్కాలిక ఆటంకం కలిగిందని గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహిస్తూ, నియామక పత్రాలు ఇచ్చే పేరిట హడావుడి చేస్తూ స్టాఫ్ నర్సు నోటిఫికేషన్ తమ ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది 2లక్షల పోస్టులను భర్తీ చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మొదటి కేబినెట్ సమావేశంలోనే ఆమోదించి, అభ్యర్థులకు ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేకుండా, ఏడాదిలోపే అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని, అలాగే గతంలో ప్రారంభించిన నియామకాల ప్రక్రియను వాటి షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ పేరిట పత్రికల్లో ప్రకటనలు విడుదల చేసిందని గుర్తు చేశారు. చెప్పినట్లుగా ఫిబ్రవరి ఒకటో తేదీన గ్రూప్-1 నోటిఫికేషన్, అలాగే ఏప్రిల్ 1న గ్రూప్-2, జూన్ 1న గ్రూప్-3,4 నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 1న పోలీసు సహా తరహా యూనిఫాం పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ఎదురుచూస్తున్న ఉద్యోగ అభ్యర్థులకు, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.స్టాఫ్ నర్సులుగా ఎంపికై బుధవారం నియామక పత్రాలు అందుకోబోతున్న అభ్యర్థులకు హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మన్ననలు పొందేలా అత్యుత్తమ సేవలందించి, ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు. మొత్తం 7,094 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు ని అభినందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సుల సేవలను గుర్తించి, వారి గౌరవాన్ని మరింత పెంచేలా వృత్తి పేరును ఉన్నతీకరించిందని హరీశ్‌రావు అన్నారు. స్టాఫ్ నర్స్‌ని నర్సింగ్ ఆఫీసర్‌గా, హెడ్ నర్స్‌ని సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, హెడ్ నర్స్‌ని సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2ను డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1ను చీఫ్ నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. నర్సు పోస్టుల పేరును మా ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో విడుదల చేసి ఉన్నతీకరించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా స్టాఫ్ నర్సులుగా పరిగణించడం శోచనీయమని హరీశ్‌రావు అన్నారు.

# ఖమ్మంలోనూ గంజాయి చాక్లెట్ల కలకలం



**ఖమ్మం, జనవరి 30 (సమ సమాజం):** రాష్ట్రంలో గంజాయి చాక్లెట్లు కలకలం సృష్టిస్తున్నాయి. హైదరాబాద్ శివార్లలోని నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట ప్రాంతంలో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న ఉదంతం మరవకముందే.. తాజాగా ఖమ్మంలో గంజాయి చాకెట్లు లభించడం ఆందోళన కలిగిస్తున్నాయి. ఖమ్మంలో నిందితుల నుంచి మూడు కిలోల గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, హైదరాబాద్ శివార్లలోని నార్సింగిలో గంజాయి చాకెట్లు కలకలం సృష్టించాయి. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట ప్రాంతంలో గంజాయి చా÷-లకెట్లు అమ్ముతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని ఒడిశాకు చెందిన సౌమ్యా రాజన్‌గా గుర్తించారు. అతని నుంచి 40 గంజాయి ప్యాకెట్లను సాధీనం చేసుకున్నారు. భవన నిర్మాణ కార్మికులకు చాలకెట్లను అమ్ముతుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు చేస్తున్నామని చెప్పారు. వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడనే విషయమై ఆరాతీస్తున్నారు.

# నితీశ్ అవసరం మాకు లేదు

## భాజాపాకు భయపడి పోయిన వ్యక్తి

### మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్



**న్యూఢిల్లీ, జనవరి 30 (సమ సమాజం):** విపక్ష 'ఇండియా' కూటమిని వీడి, భాజపాతో చేతులు కలిపిన జేడీయూ అధినేత, బిహార్ సీఎం నీతీశ్ కుమార్ అవసరం మాకు లేదంటూ..కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. 'మాకు నీతీశ్ కుమార్ అవసరం లేదు. ఆయనపై ఒత్తిడి రావడంతో యూటర్న్ తీసుకున్నారు' అని భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మొదటిసారి స్పందించారు. 'నీతీశ్ ఎందుకు విపక్ష కూటమిని వీడారో తెలుసు. బిహార్‌లో కులగణన చేపట్టాలని మేం ఆయనకు స్పష్టంగా చెప్పాం. దీనిపై కాంగ్రెస్, ఆర్జేడీ ఒత్తిడి తీసుకువచ్చింది. అందుకు భాజపా భయపడింది. ఆ పార్టీ దీనికి వ్యతిరేకం. నీతీశ్ ఇరుక్కుపోయారు. పారిపోవడానికి భాజపా ఆయనకు దారి చూపించింది. సామాజిక బాధ్యత అందించడం కూటమి బాధ్యత. దానికి నీతీశ్ అవసరం లేదు. కొంచెం ఒత్తిడి వచ్చినా ఆయన యూటర్న్ తీసుకుంటారు' అని విమర్శించారు. 2020 శాసనసభ ఎన్నికల తర్వాత నీతీశ్ మూడోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. మహాకూటమి, విపక్ష కూటమిలో కొన్ని విషయాలు నచ్చకపోవడం వల్లే భాజపాతో పొత్తు పెట్టుకున్నట్లు చెప్పారు. మిత్రపక్షాలను మార్చడం ద్వారా బిహార్‌లో సుదీర్ఘకాలంగా అధికారంలో కొనసాగుతున్న నీతీశ్.. భాజపాకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో 'ఇండియా' కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. అయితే, 'ఇండియా' కూటమి కన్వీనర్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికైనప్పటినుంచి ఆయన అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే కూటమిని వీడినట్లు తెలుస్తోంది.

# కోవిడ్‌లో ప్రాణాలకు తెగించిన వైద్యులు

## కోవిడ్ అమరుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

**విజయనగరం, జనవరి 30 (సమ సమాజం):** కోవిడ్ సమయంలో వైద్యులు ప్రాణాలకు తెగించి వైద్యం అందించారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.బాస్కరరావు కొనియాడారు. జాతీయ కోవిడ్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయనగరం డిఎంహెచ్ ఓ, ఐఎంఎ అండ్ ఎపిఎన్ఎ, విజయనగరం బ్రాంచ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా కోవిడ్ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వైద్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ?. గుర్తు తెలియని రోగంతో వైద్యులు యుద్ధం చేసి ప్రజల ప్రాణాలను కాపాడగలిగారన్నారు. అలాంటి వైద్యుల ప్రాణ త్యాగాలకు గుర్తుగా ఈరోజు నిర్వహించుకోవడం ఎంతైనా అవసరం అన్నారు. వైద్యకళాకాల ప్రిన్సిపల్ పద్మాలీల మాట్లాడుతూ ? కోవిడ్ 19 సమయంలో మరణాన్ని కలిగించే వ్యాధి అయినప్పటికీ వైద్యులు ధైర్యం గా ముందుకు వచ్చి వైద్యం అందించడమనేది గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఐ ఎం ఎ ప్రెసిడెంట్ జె.సి.నాయుడు, విజయనగరం ఐ ఎం ఎ ప్రెసిడెంట్ డా.అశోక్ , విజయనగరం ఐఎంఎ సెక్రటరీ డా.ఎల్.శ్రీనువాసరావు, ఐఎంఎ మాజీ అధ్యక్షులు, పిపిడబ్ల్యూఎస్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్, విజయనగరం ఎంపిఎన్ఎ ప్రెసిడెంట్ డా.బిగిరిధర్, విజయనగరం ఎపిఎన్ఎ సెక్రెటరీ డా.బి.చంద్రదేవ్ వర్మ , వివిధ నర్సింగ్ స్కూల్ విద్యార్థులు, ఆశావర్కర్లు, వైద్యులు, జిల్లా, పట్టణ వైద్యులు




# రాజ్యసభకు సత్నామ్ సింగ్ నామినేట్

## హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జనవరి 30 (సమ సమాజం):** చండీఘడ్ యూనివర్సిటీ ఛాన్సలర్ సత్నామ్ సింగ్ సంధును రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రపతి నామినేట్ చేశారు. సత్నామ్ సింగ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయడాన్ని స్వాగతిస్తున్నట్టుగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. సంధును రాజ్యసభకు నామినేట్ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. సత్నామ్ సింగ్ ప్రఖ్యాత విద్యావేత్త, సామాజిక సేవకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అతను అట్టడుగు స్థాయి ప్రజలకు వివిధ మార్గాల్లో సేవ మార్గంలో ఉన్నారు.సత్నామ్ సింగ్ ఎప్పుడూ జాతీయ ఐక్యతను పెంపొందించారని, ఎన్నారైలతో కలిసి పని చేశారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన రాజ్యసభకు నామినేట్ కావడం తాను శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. అలాగే రాజ్యసభ కార్యకలాపాలు ఆయన అభిప్రాయాలతో సుసంపన్నం అవుతాయని విశ్వసిస్తున్నానని మోదీ అన్నారు.

# మహనీయుల త్యాగాలు మరువరాదు

## వాటిని ఆచరణలో పెట్టడమే నివాళి: కొండా సురేఖ



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే మనం వారికిచ్చే అసలైన నివాళి అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి-సందర్భంగా దేశం కోసం పోరాడుతూ అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను మంత్రి స్మరించుకున్నారు. గాంధీజీ, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి ఎందరో దేశభక్తులు భరతజాతి విముక్తికై తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి, చరిత్రలో అజరామరమైన స్థానాన్ని పొందారని అన్నారు. దేశం పై ప్రేమతో అసమానమైన పోరాట తీరును ప్రదర్శించిన మరెందరో వీరుల తెగువ, పోరాట పటిమ ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఎందరో అమరుల త్యాగాలతో మహోన్నత దేశంగా రూపుదిద్దుకున్న భారతదేశాన్ని విచ్ఛిన్నకర శక్తుల నుంచి కాపాడేందుకు దేశ ప్రజలు, యువత పిడికిళ్లు బిగించాలని, అప్పుడే అమరవీరుల త్యాగాలకు సార్థకత చేకూరుతుందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలు, ఆదర్శాలు, సిద్ధాంతాలే ప్రేరణగా దేశ పురోగమనానికి ప్రజలంతా ఏకమై ఉక్కు సంకల్పంతో ముందుకు సాగినప్పుడే మహోజ్వల భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# ఎసిబి కస్టడీకి శివబాలకృష్ణ

## 8రోజులు అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు♦అనుమతులు, ఆస్తులపై లోతైన విచారణ

**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణను 8 రోజుల కస్టడీకి ఏసీబీకి అనుమతి ఇస్తూ మంగళవారం నాంపల్లి ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎనిమిది రోజుల పాటు బాలకృష్ణను ఏసీబీ అధికారులు విచారించనున్నారు. విచారణ సందర్భంగా బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయనున్నారు. శివ బాలక్రిష్ణ మోసాలపై ఏసీబీ అధికారులు విచారణ చేయనున్నారు. శివ బాలకృష్ణ పని చేసిన సమయంలో ప్రాజెక్ట్ ఫైల్స్ అన్ని పరిశీలించాలని ఏసీబీ నిర్ణయించింది. ఈ మేరకు హెచ్ఎండిఏ నుంచి ఫైల్స్‌ను తెప్పించుకుని విచారణ చేయనున్నారు. 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన నాంపల్లి ఏసీబీ కోర్టు 8 రోజుల కస్టడీకి అనుమతిచ్చింది. వివిధ మీడియాల్లో వచ్చిన కథనంపై అధికారులు విచారణ వేగవంతం చేయనున్నారు. పుప్పాలగూడలో రూ. వేయి కోట్లు ప్రాజెక్టు అనుమతులపై అవకతవకలు జరిగాయని.. దానికి సంబంధించిన ఫైల్స్ హెచ్ఎండిఏ ఇవ్వాలని కోరుతూ సంబంధిత అధికారులకు ఏసీబీ లేఖ రాసింది. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్.. ప్రస్తుత రెరా సెక్రటరీ శివబాలకృష్ణ, ఆయన బంధువుల ఇళ్లు, కార్యాలయాలలో ఏసీబీ అధికారులు ఐదు రోజుల క్రితం సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో.. ఎనిమిది బృందాలుగా విడిపోయిన ఏసీబీ అధికారులు బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే రాష్ట్రవ్యాప్తంగా 17 చోట్ల సోదాలు చేశారు. మణికొండలోని ఆయన నివాస గృహంలో, అమిర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో కూడా తనిఖీలు చేశారు. 2018-2023 కాలంలో హెచ్ఎండీఏ ఎ÷-లానింగ్ విభాగంలో కీలక స్థానంలో పనిచేసిన శివబాలకృష్ణ.. అధికార దుర్వినియోగానికి పాల్పడడం ద్వారా కోట్లాది రూపాయల ఆస్తులు అక్రమంగా కూడబెట్టినట్టు వచ్చిన ఆరోపణలు, వాటిపై తాజా ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో మణికొండలోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించి, పదికి పైగా ఐఫోన్లు.. అత్యంత ఖరీదైన 50 వాచీలు.. కట్టలు కట్టలుగా నగదు.. ఆయన బీరువాలో 5 కిలోల బంగారు నగలు, 70 ఎకరాలకు సంబంధించిన భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిరే.


# శివబాలకృష్ణపై కఠిన చర్యలకు రంగం సిద్ధం

## సర్వీస్ నుంచి తొలగించేందుకు ప్రభుత్వ యోచన♦అక్రమాల వెనక ఉన్న పెద్ద తలకాయల పైనా ఆరా ?



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** భారీగా అక్రమాలకు పాల్పడిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఆయన్ని సర్వీస్ నుంచి తొలగించే అంశాన్ని పరిశీలిస్తున్నారని సమాచారం. దీనికి సంబంధించిన న్యాయ పరమైన సలహాలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆయన అవినీతి వెనక ఎవరెవరు ఉన్నారన్న దానిపైనా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. పెద్ద తలకాయలు ఆదేశాలు లేనిదే ఇంతటి అవినీతికి పాల్పడరన్న బలమైన అనుమానాలు వస్తున్నాయి. ఇప్పుడు ఈకేసు ఒక్క శివబాలకృష్ణతో పోవడం లేదు. ఆయన దగ్గర పని చేసే అధికారుల మెడకి కూడా చుట్టుకుంటోంది. ఆయనతో పని చేసే అధికారులను కూడా ఏసీబీ అధికారులు విచారించనున్నారు. దీనిపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. మొదటి నుంచి ఆయనతో కలిసి పని చేసే ఉద్యోగులందరికీ నోటీసులు ఇచ్చారు. వారిని విచారించి ఇంకా పూర్తి వివరాలు రాబట్టనున్నారు. ఇప్పటికే శివ బాలకృష్ణకు సంబంధించిన నివాసాల్లో సోదాలు చేశారు. ఆయన బినామి ఆస్తులు కూడా గుర్తించారు. ఇప్పుడు ఆయనతో పని చేసే ఉద్యోగులను విచారిస్తే ఇంకా ఎన్ని సంచలనాలు బయటకు వస్తాయో అన్న ఆసక్తి నెలకొంది. ఆయన బ్యాంకు ఖాతాలు, లాకర్లు అన్నింటినీ సీజ్ చేశారు. ఆయన్ని కస్టడీలోకి తీసుకొని విచారించాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. శివబాలకృష్ణ కస్టడీ పిటిషన్ విచారణకు రానుంది. దీనిపై కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో కాసేపట్లో తేలిపోనుంది. ఆయన్ని పది రోజుల కస్టడీకి ఇచ్చిన్నట్లైతే.... ఆయన చేపట్టే లావాదేవీలు, బీనామీల వివరాలపై ప్రశ్నలు అడిగే ఛాన్స్ ఉంది. ఈ దందాలో ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో కూడా విచారణ సాగనుంది. ఆయన చెప్పే సమాధానాల బట్టి మరి కొందర్ని కూడా అదుపులోకి తీసుకొని ప్రశ్నించే ఛాన్స్ ఉందంటున్నారు అధికారులు. మరోవైపు శివబాలకృష్ణ కారణంగా ఇబ్బంది పడ్డ వారంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. లే అవుట్‌లు వేసుకునేందుకు అనుమతుల కోసం డబ్బులు తీసుకొని పని చేయాలని వారంతా ఇప్పుడు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ మధ్యే శివ బాలకృష్ణ నివాసాలు, ఆఫీస్‌లపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఐదు వందల కోట్లకుపైగా అక్రమాస్తులు గుర్తించారు. ఆయనపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

# కొత్త జిల్లాల ఏర్పాటుపై కమిషన్



(మొదటి పేజీ తరువాయి) జిల్లాని ఏర్పాటు చేయాలని డిమాండ్ రోజురోజుకి పెరుగుతుంది. అప్పటి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో హుజురాబాద్ కేంద్రం గా పీవీ నరసింహారావు జిల్లాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా అందోళన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అయినా ఫలించలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మరోసారి పీవీ జిల్లా తెరపైకి వచ్చింది.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ కేంద్రంగా పీవీ నరసింహారావు జిల్లాని ఏర్పాటు చేయాలని మేధావులతో పాటు ప్రజాసంఘాలు డిమాండ్ చెస్తున్నాయి. మాజీ ప్రధాని పీవీ భీమదేవరపల్లి మండలం వంగరలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం ఇక్కడి నుండే మొదలు అయ్యింది. అయన జ్ఞాపకాల గుర్తుగా హుజురాబాద్ కేంద్రంగా పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలారోజుల నుండి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది జిల్లాల నుండి ముప్పై మూడు జిల్లాలకి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అ సమయంలోనే పీవీ జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ పెరిగింది. ఈక్రమంలోనే పీవీ జిల్లా సాధన సమితిని కూడా జేఏసి నేతలు ఏర్పాటు చేశారు. అప్పట్లో హుజురాబాద్ కేంద్రంగా నెల రోజులపాటు అందోళన కార్యక్రమాలు జరిగాయి. అప్పటి రాష్ట్ర మంత్రి ఈటెల రాజేందర్ జోక్యం చేసుకుని అందోళన విరమింపజేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. అయితే హుజురాబాద్ జిల్లా కేంద్రం కాకుండా డివిజన్ కేంద్రంగా మారింది. మళ్ళీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో జిల్లాల పునర్విభజనపై చర్చ జరుగుతోంది ఈ క్రమంలో మరోసారి పీవీ జిల్లా తెరపైకి వచ్చింది. నిజానికి ప్రొఫెసర్ జయశంకర్, కుమ్రం భీమ్, యాదాద్రి, వేములవాడ రాజన్న, జోగులాంబల పేరు మీద జిల్లాలు ఏర్పాడ్డాయి. పివి పేరు మా÷-తరం విస్మరించారు. దీంతో హుజురాబాద్ కేంద్రంగా పదిహేను మండలాలని కలుపుతూ పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని మేధావులతో పాటుగా ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్పడిన తరువాత మొదటిసారిగా హుజురాబాద్‌లో పీవీ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం హాజరు అయ్యారు. అయన సైతం పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని సూచించారు. పీవీ జిల్లాపై ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీవీ చేపట్టిన అర్థిక సంస్కరణలు భూ సంస్కరణలు చేపట్టారని ప్రస్తావించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని జిల్లాలని మార్చడం, లేదంటే కుదించడంపై చర్చ సాగుతుంది. పరిపాలన సౌలభ్యంగా ఉండే జిల్లాలని ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రభుత్వం తెలిపింది. పీవీ జిల్లా ఏర్పాటుకు ప్రతిపక్షాలు కూడా మద్దతు ఇవ్వడంతో ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. పీవీ సేవలు గుర్తుండే విధంగా అయన పేరుతో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జేఏసి నేతలు డిమాండ్ చేస్తున్నారు. అరేళ్ళుగా ఉద్యమాలు చేస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పీవీ జిల్లా కోసం ఎనిమిది ఏళ్ళుగా పోరాటం సాగుతుందని ఎమ్మెల్సీ కోదండరాం అంటున్నారు. అయన పేరు పైనా జిల్లా ఏర్పటుపై సర్వరమే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాల పరిశీలనపై కమిటీ వేసి చర్చించే అవకాశం ఉంది. విధివిధానాలు ఖరారు చేస్తారు. ఆ మేరకు జిల్లాల ఏర్పాటుతో పాటు, రూపురేఖలు మారనున్నాయి. అప్పుడు పివి జిల్లా ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణానికి బ్రేక్



(మొదటి పేజీ తరువాయి) ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, అమిర్ అలీఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై రాష్ట్ర హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం యథాతథ స్థితినే కొనసాగించాలని, తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించవద్దని తన ఆదేశాల్లో పేర్కొన్నది. దాంతో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా ప్రొఫెసర్ కోదండరామ్, అమిర్ అలీఖాన్‌లు ప్రమాణం చేయడానికి వీల్లేకుండా పోయింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమిర్‌ఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. దాంతో కోర్టు తాజా ఉత్తర్వులు ఇచ్చింది. కొద్ది నెలల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దాసోజు శ్రవణ్, సత్యనారాయణలను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు నామినేట్ చేసింది. అయితే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వారి పేర్లను తిరస్కరించారు. అయితే గవర్నర్ తమ నియామకాలకు ఆమోదం తెలుపకపోవడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ రాష్ట్ర హైకోర్టుకు వెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టికల్ 171 ప్రకారం తమను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందని.. దాన్ని తిరస్కరించే హక్కు గవర్నర్ లేదని వారు పేర్కొన్నారు. ఆ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈలోపే కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్, అమిర్ అలీఖాన్‌లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించడం, గవర్నర్ ఆమోదం తెలపడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టుకు వెళ్లారు.

# బిసి కులగణన నిర్ణయం హర్షణీయం

## సిఎం రేవంత్‌ను కలిసి అభినందించిన కృష్ణయ్య



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** తెలంగాణలో బీసీ కులగణన చేసేందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య అన్నారు. మంగళవారం డా. బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఉన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో, బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ ప్రకారం కుల గణన చేపడుతామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ఆర్. కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. కుల గణనతో బీసీ కులాలు, ఉప కులాలన్నింటికీ ప్రభుత్వ పథకాల్లో సముచిత న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అధికారం చేపట్టిన రోజు నుంచే తెలంగాణలో ప్రజాపాలనను అందిస్తున్నందుకు సీఎంకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే కుల గణన బిల్లు పెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

# కెటిఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి) వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో జిల్లాల్లో మెల్లగా మున్సిపాలిటీలు హస్తగతం అవుతున్నాయి. జిల్లాల్లో మెల్లగా సర్పంచ్‌లు, జడ్పీటిసిలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకున్న కెటిఆర్‌ను క్షేత్రస్థాయిలో దెబ్బకొట్టాలని కాంగ్రెస్ యోచిస్తోంది. పట్టు పెంచుకోవడం లో భాగంగా బీఆర్ఎస్‌ను బలహీనం చేయడంపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తోందని తెలుస్తోంది. బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ వేసినట్టుగా తెలుస్తోంది. ప్రణాళికలో భాగంగా సిరిసిల్లపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రయత్నాలలో భాగంగా ఇప్పటికే ముస్తాబాద్ జెడ్పీటీసీ, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు రాజీనామాలు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇప్పటికే దాదాపు 40 మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేసినట్టుగా తెలుస్తోంది. కేటీఆర్ విప్‌ను సైతం కౌన్సిలర్లు బేఖాతర్ చేస్తున్నారు. సొంత నియోజకవర్గంలో నేతల తిరుబాటుతో కేటీఆర్‌కు తలనొప్పిగా మారింది. నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశనర చేసి 24 గంటలు కూడా గడవక ముందే ముస్తాబాద్ జెడ్పీటీసీ గుండం నర్సయ్యతో పాటు పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పలువురు ముఖ్యనేతలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరంతా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ పరిణామం కేటీఆర్‌కు తలనొప్పిగా మారినట్టు పొలిటికల్స్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. కేటీఆర్‌ను అష్టదిగ్బంధనం చేసి ఊపిరి సలపకుండా చేసే ఎత్తుగడలు, వ్యూహాలకు కాంగ్రెస్ పార్టీ తెరలేపింది. ఈ మేరకు ప్రణాళికలకు హస్తం పార్టీ పదును పెట్టినట్టుగా తెలుస్తోంది. దీంతో కేటీఆర్ చుట్టూ రాజకీయం హాట్‌హాట్‌గా మారింది. ఆపరేషన్ ఆకర్ష్‌ను మొదలు పెట్టినట్టుగా పరిణామాల చూస్తే అర్థమవుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఆకర్షితులవుతు న్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# నేటి నుండి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

## వరుసగా ఆరోసారి బడ్జెట్ సమర్పించిన మహిళా నేతగా నిర్మలా సీతారామన్



(మొదటి పేజీ తరువాయి)వేలకు పెంచే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వంపై రూ.12 వేల కోట్ల భారం పడనుంది. ప్రస్తుత సమావేశాల్లో 19 బిల్లులు ఆమోదించే అవకాశం ఉంది. ఇన్‌కమ్ ట్యాక్స్ తదితర విషయాల్లో పాతపద్ధతినే అవలంబించే ఛాన్స్ ఉంది.

# ధర్నాలో విద్యార్థిని ఈడ్చుకెళ్లిన కానిస్టేబుల్




(మొదటి పేజీ తరువాయి) ఆయేషా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని హోండా యాక్టివాపై వెంబడిస్తూ జుట్టు పట్టి ఈడ్చుకెళ్లారు. దీంతో ఆ యువతి కింద పడి తీవ్ర గాయాల పాలై దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఈ ఘటనపై పత్రికల్లో వార్త ప్రముఖంగా ప్రచురితమైంది. అనేక సోషల్ మీడియాల్లో వీడియో వైరల్ అయ్యింది. స్పందించిన సీపీ.. విచారణ చేపట్టి కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకొన్నారు. అటు.. జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా స్పందించింది. మీడియా కథనాలను సుమోటోగా స్వీకరించి.. ఘటనపై వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. యువతి ఆరోగ్య పరిస్థితి సహా పూర్తి వివరాలతో నాలుగు వారాల్లోగా నివేదిక అందించాలని సీఎస్, డీజీపీకి నోటీసులు ఇచ్చింది.

# చర్లపల్లి టర్మినల్ భూ సమస్య పరిష్కరించాలి

## సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి మంగళవారం నాడు లేఖ రాశారు. జంట నగరాలకు వస్తున్న రైల్వే ప్రయాణికులకు మరింత సౌలభ్యాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. చర్లపల్లి టర్మినల్ నిర్మాణానికి కొన్ని అడ్డంకులు ఉన్నాయని.. ఆ ప్రాజెక్టు కోసం భూ కేటాయింపులు కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఉత్తరం వైపు టర్మినల్ చేరుకునేందుకు ఉన్న రహదారి విస్తరణకు సహకారం అందించాలన్నారు. మౌలాలీ యార్డ్ స్టేషన్ సమీపంలో ట్రాక్ పైకి.. మురుగునీరు వస్తుండటంపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**పెద్దపల్లి, జనవరి 30 (సమ సమాజం):** పెద్దపల్లి జిల్లా లో రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బైక్‌పై వెళు _న్న ముగ్గురు యువకులు ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేటు వద్ద గోపరపల్లె గ్రామ శివారులో ప్రమాదానికి గురయ్యారు. మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఇందులో గోపరపల్లి గ్రామానికి చెందిన దాసరి వంశీకృష్ణారెడ్డి (18), పెగడపల్లి గ్రామానికి చెందిన జీల మహేశ్?((19) మరణించారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లి గ్రామానికి చెందిన సంజయ్ అనే యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా అతడిని చికిత్స కోసం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది.

# డబుల్ ఇళ్లను వెంటనే అప్పగించాలి

## గజ్వేల్‌లో లబ్దిదారుల ఆందోళన



**గజ్వేల్, జనవరి 30 (సమ సమాజం):** తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూంలు ఇవ్వాలని లబ్దిదారులు ఆందోళన చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో తమకు ఇండ్ల పొసిషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ... అంబేద్కర్ విగ్రహం వద్ద డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్కీ డ్రా తీసి 8 నెలలు గడిచిని ఇప్పటివరకు ఇండ్లు కేటాయించలేదన్నారు. గత ప్రభుత్వం గజ్వేల్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు1100 మంది లబ్దిదారులను డ్రా ద్వారా గుర్తించిందన్నారు. ఇండ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్? ప్రభుత్వం తమకు ఇండ్లు కేటాయించాలని కోరారు.

# యువతిపై సెలూన్ యజమాని అత్యాచార యత్నం

## సానిటైజర్ తాగి యువతి ఆత్మహత్య




**రంగారెడ్డి, జనవరి 30 (సమ సమాజం):** సెలూన్ యజమాని వేధింపులతో ఓ యువతి సానిటైజర్ తాగి ఆత్మహత్య చేసుకుంది. రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. గత కొంత కాలంగా ఓ సెలూన్ లో పని చేస్తున్న దివ్యను యజమాని మురళి లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు సమాచారం. మంగళవారం మరళి సెలూన్ లో ఉన్న ఓ గదిలోకి దివ్య(18)ను తీసుకెళ్లి రేప్ చేయడానికి ప్రయత్నం చేయగా.. దివ్య బయటికి వచ్చి అరవడంతో మురళి అక్కడి నుంచి పరారైయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన దివ్య సెలూన్ లో ఉన్న శానిటైజర్ తాగి ఆత్మహత్య చేసుకుంది. గతంలో పలుమార్లు మురళి దివ్యను రేప్ చేశాడని సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న దివ్య కుటుంబ సభ్యులు సెలూన్ దగ్గర ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లేది లేదని.. పోలీసులతో వాగ్వాదం పెట్టుకున్నారు. వారికి నచ్చజెప్పిన పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి




**పెద్దపల్లి, జనవరి 30 (సమ సమాజం):** పెద్దపల్లి జిల్లా లో రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేటు వద్ద గోపరపల్లె గ్రామ శివారులో ప్రమాదానికి గురయ్యారు. మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఇందులో గోపరపల్లి గ్రామానికి చెందిన దాసరి వంశీకృష్ణారెడ్డి (18), పెగడపల్లి గ్రామానికి చెందిన జీల మహేశ్?((19) మరణించారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లి గ్రామానికి చెందిన సంజయ్ అనే యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా అతడిని చికిత్స కోసం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది.

# నకిలీ పాస్‌పోర్టుకేసులో ఏఎస్ఐ అరెస్ట్




**నిజామాబాద్, జనవరి 30 (సమ సమాజం):** నకిలీ పాస్ పోర్టు కేసులో ఎస్బీ ఏఎస్సైని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. మాక్లూర్, నవీపేట ఎస్బీ ఇన్‌ఛార్జ్ గా లక్ష్మణ్ పనిచేస్తున్నారు. సీఐడీ అధికారులు నిజామాబాద్? సిటీలోని గంగస్థాన్‌లో ఉన్నలో తన నివాసం నుంచి లక్ష్మణ్ ను ఇవాళ తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తీసుకెళ్లారు. దీంతో భీంగల్ కేంద్రంగా లైసెన్స్‌లు లేని ట్రావెల్స్ నిర్వాహకుల్లో భయాందోళన మొదలైంది. కాగా, భీంగల్ మండల కేంద్రంలో సీబీసీఐడీ టీం సుమారు గంటన్నర పాటు ముచ్కూర్ రోడ్డులో గల నకిలీ పాస్ పోర్టుల కేసు నిందితుడు సుభాష్ ఇంట్లో సోదాలు నిర్వహించి అతని వద్ద నుండి ల్యాప్ టాప్, ఇతర విలువైన సమాచారం గల పత్రాలు, నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకొన్నారు. దాంతో పాటుగా నిందితుడిని అదుపులోకి తీసుకొని వెళ్లిన సీఐడీ బృందం ఇంట్రాగేట్ చేసింది.ఈ సమాచారంతోనే లక్ష్మణ్‌ను అరెస్ట్? చేసినట్లు తెలిసింది.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in